రబీ సీజన్‌కు రైతుల సన్నద్ధం

- ఈ నెలాఖరు నాటికి వరినాట్ల పూర్తికి ప్రయత్నం
- ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందించాలని వినతి
- వ్యవసాయశాఖ పర్యవేక్షణలోనే పురుగుమందుల వినియోగం


పినపళ్లలో రబీ పంటకు నారుమడిని సిద్ధం చేసుకుంటున్న రైతు


పెదపళ్లలో వెదజల్లు సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్న రైతులు

ఆలమూరు: ఖరీఫ్ సీజన్‌లోని వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నా తేమ శాతం పేరిట తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న అన్నదాత మళ్లీ రబీ సాగుకు ముమ్మరంగా సమాయత్తమవుతున్నారు. రబీ పంటకు నిర్ణీత సమయంలో తూర్పు, మధ్య డెల్టా ప్రధాన కాలువల నుంచి క్లస్టర్ పరిధిలోని మండలాలకు సకాలంలో నీటిని విడుదల చేస్తే పనులు ప్రారంభించేందుకు వెసులుబాటు కలుగుతుందనే అభిప్రాయం రైతుల నుంచి వ్యక్తమవుతుంది. అయితే కొన్ని పంట కాలువల్లో వ్యర్థాలు అధికంగా ఉండటంతో శివారు ప్రాంత రైతులకు ఇబ్బందిగా మారడంతో ఆ దిశగా ఇరిగేషన్‌శాఖ నష్ట నివారణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వ్యవసాయశాఖ సూచనల మేరకు డిసెంబర్ నెలాఖరు నాటికి వరినాట్లు పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేసినా వాస్తవ పరిస్థితుల్లో గణనీయమైన తేడాలు ఉండటం వల్ల వ్యవసాయశాఖ సూచనలు అమలు చేసే అవకాశం రైతులకు లేకుండా పోయింది. దీంతో కొన్ని గ్రామాల్లోని రైతులు గ్రామాభివృద్ధి కమిటీ ద్వారా కాని, ఎన్ఆర్‌జీఈఎస్ ద్వారా కాని పంటకాలువలను శుభ్రం చేసుకుని సాగునీరు సక్రమంగా పారేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వచ్చే ఏప్రిల్ ప్రథమార్థంలో కోతల పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్న వ్యవసాయశాఖ సూచనలు అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఖరీఫ్ సీజన్ పంట కోత, మాసూళ్ల సమయంలో కురిసిన భారీ వర్షాల వల్ల రబీ సాగు ప్రారంభానికి తీవ్ర జాప్యం జరుగుతుంది. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో రబీ సీజన్‌కు 58,487 ఎకరాల్లో వరి సాగు జరగనుంది. అందులో ఈ ఏడాది రికార్డు స్థాయిలో సుమారు 50 వేల ఎకరాల్లో వెదజల్లు పద్ధతిని అవలంబిస్తుండగా మిగతా భూముల్లో ఆకుమడుల ప్రక్రియ చురుగ్గా జరుగుతుంది. దమ్ములో వినియోగించే జింక్, బోరాన్ ఎరువుల మిశ్రమాన్ని పొలంలో వేసి దుక్కి చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

బొండాలపై తగ్గుతున్న మోజు

రబీ సీజన్‌లో ఎక్కువగా సాగు చేసే ఎంటీయూ 3626 (బొండాలు) రకంపై రైతుల్లో మోజు తగ్గుతూ వస్తుంది. గత రబీ సీజన్‌లో బొండాలు ధాన్యాన్ని ఏడాది పాటు నిల్వ ఉంచినా ధరల్లో మార్పు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. బొండాలు బియ్యాన్ని రాష్ట్రంలో ఉపయోగించకపోవడం, కేవలం కేరళ మార్కెట్ మీద ఆధారపడటం వంటి చర్యల వల్ల బొండాలు సాగుకు రైతులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు బొండాలకు ప్రత్యామ్నాయంగా సన్న రకాలైన శ్రీధ్రుతి, చంద్ర, తరంగిణి వంటి రకాలను ప్రభుత్వం ప్రోత్సహించడంతో పాటు సరైన గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆ దిశగా సాగు చేపట్టారు. దీంతో ఈ ఏడాది బొండాల సాగు కేవలం 40 శాతానికి పడిపోగా మిగతా రకాలు రబీ సీజన్‌ను ఆక్రమించాయి. సాధారణంగా బొండాలు రకం విత్తనం 135 రోజులకు పక్వానికి వస్తే మిగతా స్వల్పకాలిక రకాల విత్తనాలు 125 రోజులకే కోతకు రావడం వల్ల పెట్టుబడి భారీగా తగ్గుతుందనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతుంది.

స్వల్పకాలిక విత్తన సాగుకు ప్రాధాన్యమివ్వాలి



వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆకుమడుల ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెలాఖరు నాటికి వరినాట్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి. రబీ సాగుకు స్వల్పకాలిక రకాల విత్తనాల సాగుకు ప్రాధాన్యతక ఇవ్వాలి. ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయి.

– ఎస్.లక్ష్మీ లావణ్య, ఏవో, ఆలమూరు.

క్లుప్తంగా

రేపటి నుంచి ధనుర్మాస మాసోత్సవం

మామిడికుదురు: పవిత్ర వైనతేయ గోదావరి నదీ తీరం అప్పనపల్లిలో కొలువుదీరిన బాల బాలాజీ స్వామి వారి ధనుర్మాస మహోత్సవం సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు శనివారం తెలిపారు. ఈ నెల 16వ తేదీ సోమవారం నుంచి జనవరి 13వ తేదీ సోమవారం వరకు నెల రోజులు ధనుర్మాస మహోత్సవం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 6.57 గంటలకు ధనుర్మాసం ప్రారంభమవుతుందన్నారు. దీనిలో భాగంగా బాల బాలాజీ స్వామి వారి సన్నిధిలో వేంచేసి ఉన్న ఆండాళ్‌తాయారు (గోదాదేవి)కి ప్రతి రోజు మేళతాళాలతో అర్చక స్వాములు తీర్థపు బిందెతో గ్రామోత్సవం, 'తిరుప్పావై' సేవాకాలం నిర్వహిస్తారన్నారు. దీనిలో భాగంగా ప్రతి రోజు ఉదయం 5 నుంచి 6 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా నివేదన, నిత్య హోమం, బలిహరణ, మంగళశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి ఏర్పాటు చేశామని ఈఓ తెలిపారు.

రామలింగరాజు సేవలు మరువలేనివి


రామలింగరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గోపాలకృష్ణంరాజు తదితరులు

మలికిపురం: మాజీ మంత్రి రుద్రరాజు రామలింగరాజు సేవలు మరువలేనివని లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాల కృష్ణంరాజు పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, ఈ ప్రాంతానికి ఎన్నో సేవలు అందించిన మహా వ్యక్తి, సఖినేటిపల్లి మండలం గుడిమూల గ్రామానికి చెందిన రుద్రరాజు రామలింగరాజు జయంతి సందర్భంగా మలికిపురం మండలం లక్కవరంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అప్పారి వెంకట సూర్యనారాయణ, బత్తుల చిట్టిబాబు, పంచాయతీ, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి వేదిక లోక్ అదాలత్


రాజోలులో మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి ప్రమీలారాణి

రాజోలు: కేసులను త్వరితగతిన పరిష్కరించేకునేందుకు వేదికగా లోక్ అదాలత్ నిలుస్తుందని రాజోలు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి అన్నారు. శనివారం రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లో మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. కోర్టు ఆవరణలో జరిగిన న్యాయ అవగాహన సదస్సు జరిగింది. రాజీయే రాజమార్గంగా కేసులు పరిష్కరించుకోవచ్చని, లోక్ అదాలత్‌లో పరిష్కారమైతే ఏ ఇతర న్యాయస్థానాల్లో అప్పీల్ చేసినా చెల్లదన్నారు. మెగా లోక్‌అదాలత్‌లో మొత్తం 144 కేసులకుగాను రూ.97.68 లక్షల ఆర్థిక లావాదేవీలు పరిష్కరించారు. రెండు బెంచ్‌లుగా సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు అదాలత్‌లోని కేసులను పరిష్కరించారు. లోక్‌అదాలత్ సభ్యులు ఆచంట శ్రీనివాస్, డీఎస్ఎస్ఆర్ఏ శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడిశెట్టి సాయిబాబు, గొల్లమందల స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చని ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఇంటూరి ప్రవీణ్ కుమార్ అన్నారు. స్థానిక జూనియర్ జడ్జి కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్‌అదాలత్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. జాతీయ లోక్ అదాలత్‌లో 84 కేసులు పరిష్కరించారు. వివిధ కేసుల ద్వారా వచ్చిన సుమారు 43 లక్షల 99 వేల రూపాయలు కక్షిదారులకు ముట్టాయి. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పని దీని ద్వారా కేసులను పరిష్కరించుకొని సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జొన్నపల్లి సత్యనారాయణ, పీపీ వి.శ్రీరాములు, బెంచ్ మెంబర్ కేవీవీ సాయిరాం, స్థానిక న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి నర్సింగ్ హోమ్‌లో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం

రావులపాలెం: స్థానిక ప్రగతి నర్సింగ్ హోమ్‌లో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలను శనివారం నుంచి ప్రారంభించారు. ఈ సేవలను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ సేవలు ఎంతోమంది పేద కుటుంబాలకు మేలు చేకూరుస్తుందన్నారు. గత 30 ఏళ్లుగా డాక్టర్లు కర్రి బలరామిరెడ్డి, అనంతలక్ష్మి దంపతులు ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయం అన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ మహిళల నిరసన


సమస్యలపై నిరసన తెలుపుతున్న జగ్గన్నపేట మహిళలు

మామిడికుదురు: సమస్యలు పరిష్కరించాలని మొగలికుదురు గ్రామ పరిధిలోని జగ్గన్నపేటకు చెందిన మహిళలు శనివారం నిరసన తెలిపారు. తాటిపాక పైప్‌లైన్ ద్వారా వచ్చే తాగునీరు సక్రమంగా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పైప్‌లైన్ తరచూ పాడైపోయి తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. మొగలికుదురు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద తొలగించిన తాగునీటి ట్యాంకు స్థానే బోరు ఏర్పాటు చేసి దాని ద్వారా తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అక్కడే ఉన్న పంచాయతీ చెరువు చుట్టూ పరిస్థితి దారుణంగా ఉందని, తుప్పలు పెరిగిపోయి అక్కడ పరిస్థితి అధ్వానంగా ఉండడంతో దోమల బెడద తీవ్రంగా ఉంటుందని వాపోయారు. చెరువు చుట్టూ బాగు చేయించి దోమల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాటిపాక గ్రామ పంచాయతీ నుంచి వచ్చే మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ సమస్యలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి కూడా తీసుకు వెళ్తామన్నారు. ఈ ఆందోళనలో కట్టా పద్మావతి, స్వర్ణకుమారి, తోలేటి అన్నపూర్ణ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో సత్తా చాటిన అక్కాచెల్లెళ్లు


బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటిన అక్కాచెల్లెళ్లు

మామిడికుదురు: రాజానగరం నన్నయ యూనివర్సిటీలో జరుగుతున్న అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ చాంపియన్ షిప్, బాక్సింగ్ పోటీల్లో గెద్దాడకు చెందిన అక్కాచెల్లెళ్లు చిట్టూరి సాయి వరలక్ష్మి, చిట్టూరి యోగితాకుమారి సత్తా చాటారు. రాజమహేంద్రవరం ఐఏఎస్ అకాడమీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న చిట్టూరి సాయివరలక్ష్మి బాక్సింగ్ లైట్ ఫ్లై విభాగంలో బంగారు పతకం గెలుపొందింది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చిట్టూరి యోగితాకుమారి అండర్–19 బాక్సింగ్ పోటీల్లో ఫ్లై వెయిట్ విభాగంలో వెండి పతకం సాధించింది. పతకాలు సాధించిన ఈ విద్యార్థులను బాక్సింగ్ కోచ్ చిట్టూరి చంద్రశేఖర్‌తో పాటు ఆయా కళాశాలలకు చెందిన అధ్యాపకులు, స్థానికులు అభినందించారు.

అథ్లెటిక్స్‌లో పావనికి బంగారు పతకం


రన్నింగ్‌లో బంగారు పతకం సాధించిన సాయిమహి

రాజానగరం నన్నయ యూనివర్సిటీలో జరుగుతున్న అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో రన్నింగ్ విభాగంలో గెద్దాడకు చెందిన గంధం పావనీసాయి మహి బంగారు పతకం సాధించింది. శనివారం జరిగిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో రన్నింగ్ విభాగంలో 21 కిలో మీటర్ల రన్నింగ్‌లో సాయిమహి గోల్డ్ మెడల్ సాధించి సత్తా చాటింది. ఆమె ప్రస్తుతం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో యూజీడీపీటీ కోర్సు చదువుతోంది. బంగారు పతకం సాధించిన సాయిమహిని అధ్యాపకులు, స్థానికులు అభినందించారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం


గంగలకుర్రులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్రీనివాస్

అంబాజీపేట: వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ అన్నారు. గంగలకుర్రు ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ భోజనం చేసే ముందు సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణంలో చలిగాలులు, మంచు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో ఆరుబయట తిరగకూడదన్నారు. వంట చేసే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, వంట పాత్రలను ఎప్పటికప్పుడు వేడి నీళ్లతో శుభ్రపరచాలన్నారు. అంతకుముందు హిమోగ్లోబిన్, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బి.అప్పారావు, ఎల్‌టీపీ రవితేజ, ఎంపీహెచ్ఏ జీవీవీకే ప్రసాద్, ఏఎన్ఎం ఎన్.నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ దుర్గాప్రసాద్, ఆశాలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు


క్యూలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభహారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటికబెల్లం తులాభారంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

శనైశ్చరుని ఆదాయం రూ.1.69 లక్షలు

కొత్తపేట: మండలంలో మందపల్లిలో వేంచేసిన మందేశ్వర(శనైశ్చర) స్వామికి శనివారం రూ 1.69 లక్షల ఆదాయం లభించింది. శని త్రయోదశి సందర్భంగా దేశం నలుమూలల నుంచి అనేక మంది భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. తైలాభిషేకాల ద్వారా రూ.1,27,765, అన్న ప్రసాద విరాళాల ద్వారా రూ.41,472 మొత్తం వెరసి రూ.1,69,192 లభించిందని ఉప కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

అంగరంగ వైభవంగా గోవృషభ కల్యాణం


గో వృషభ కల్యాణం జరుపుకొన్న గోవులు

ఆలమూరు: లోక కల్యాణం, పశుసంపద వృద్ధి, దేశ క్షేమం కోరుతూ మండలంలోని పెదపళ్లలో శనివారం గో వృషభ కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన ఉండమట్ల రాంబాబు, వెంకట పద్మావతి దంపతులు ఈ పూజలు నిర్వహించారు. గోవుల తరఫున రామచంద్రపురం మండలం మెళ్లూరుకు చెందిన మాగాపు శ్రీనివాస్ లిద్దరూ అగ్నిజ్యోతి దంపతులు తల్లిదండ్రులుగా (కళ్యాణ కర్తలుగా) వ్యవహరించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా రుత్వికులు కల్యాణాన్ని జరిపించారు. ఆవుకు, ఎద్దుకు మంగళస్నానాలు చేయించి, పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా అలంకరించి, బాసికాలు కట్టి ఉదయం 8.03 నిమిషాలకు సుముహూర్తంలో జీలకర్ర, బెల్లం పెట్టించారు. అనంతరం తాళి కట్టడం, తలంబ్రాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వృషభానికి శంఖు, చక్రం అచ్చు వేసి వదిలారు. గో వృషభ కల్యాణం సందర్భంగా రాంబాబు దంపతులు భారీ అన్నసమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు, భక్తులు వచ్చి గో వృషభ కళ్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అనారోగ్య బాధితురాలికి సాయం


బాధితురాలి భర్తకు సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శనివారం రూ.12,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మొగల్తూరు గ్రామ శివారు ఆకనివారితోటకి చెందిన గుమ్మళ్ల మహాలక్ష్మి (45) రెండు కిడ్నీలు పాడైపోయి, తలలో రక్తం గడ్డగట్టి చెయ్యి, కాలు పడిపోయి వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. దీంతో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. మహాలక్ష్మి భర్త వెంకన్నకు సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.12,500 చెక్కు అందజేశారు.

ఆలమూరు మండల అధికారుల ఫోన్ నంబర్లు

హోదా	పేరు	ఫోన్ నంబర్
తహసీల్దార్	కెజె.ప్రకాష్‌బాబు	98499 03902
రావులపాలెం సీఐ	సీహెచ్.విద్యాసాగర్	94407 96537
సబ్ ఇన్‌స్పెక్టర్	ఎం.అశోక్	9440904849
ఎంపీడీఓ	కె.జాన్‌లింకన్	94938 17051
ఈఓపీఆర్‌డీ	ఏ రాజు	83175 42815
ఏడీఏ	కె.నాగేశ్వరరావు	83310 56664
ఏఓ	ఎస్.లక్ష్మీ లావణ్య	83310 56557
ఏపీఓ	జి.అరుణకుమారి	70933 23644
ఏపీఎం	ఎం.ధనరాజు	98499 01696
హౌసింగ్ జేఈ	డి.శ్రీనివాసు	70939 30448
ఎంఈఓ–1	బి.అప్పాజీ	80748 05733
ఎంఈఓ–2	కెవి.సుబ్బరాజు	96189 37973
ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ	పి.పద్మ	91001 21135
సీడీపీఓ, కొత్తపేట	పి.శారద	94408 14683
చొప్పెల్ల పీహెచ్‌సీ	డి.సువర్ణలాదేవి	70136 40523
పెదపళ్ల పీహెచ్‌సీ	పి.భవానీశంకర్	88017 87816
ఇరిగేషన్ జేఈ	కృష్ణ త్రిమూర్తులు	83286 29109
పశుసంవర్ధకశాఖ ఏడీ	ఎల్.అనిత	95503 93727
పశువైద్యాధికారి	జి.భానుప్రసాద్	95332 87404
ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్	డి.నాగేశ్వరరావు	97012 87828
ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్	పి.రాంబాబు	91609 88844
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	టిఎస్‌వి.నాగలక్ష్మి	63099 39852
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	వై.అరుంధతి	89778 30575
ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి	పి.గోపిరామ్	93467 87187
మండల ఇంజనీరింగ్ జేఈ	డి.వీరభద్రరావు	83175 43987
ఆర్అండ్‌బీ జేఈ (ఇన్‌చార్జి)	సూర్యనారాయణ	94408 18285

ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు


సఖినేటిపల్లిలో నీటి సంఘ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను అభినందిస్తున్న గొల్లపల్లి సూర్యారావు


రాజోలు నీటి సంఘ అధ్యక్షుడు బుజ్జికి ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి నీటి సంఘ పరిధిలోని సఖినేటిపల్లి పంచాయతీలో ఉన్న మూడు స్థానాలకు శనివారం జరిగిన ఎన్నికల్లో ముగ్గురు రైతులు విజయం సాధించారు. సదరు పంచాయతీలో నాలుగు టీసీ స్థానాలు ఉండగా ఒకటి ఏకగ్రీవమైంది. మిగిలిన మూడింటికి ఎన్నికను అధికారులు నిర్వహించారు. ఈ మూడింటిలో కమిడి రాజీవ్ భూషణ్, గొల్లమందల కిన్ను, ఇంజేటి స్వామిదాస్‌లు విజయం సాధించారు. కాగా విజయం సాధించిన ముగ్గురు టీసీ సభ్యులను రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు సత్కరించారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని నేదునూరు, అయినవిల్లి, శానపల్లిలంక నీటి సంఘాలు ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ సంఘ నీటి సంఘాల్లో 12 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా అందులో పది మంది డైరెక్టర్ ఒకరిని చైర్మన్‌గా మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. నేదునూరు నీటి సంఘం అధ్యక్షుడిగా చింతపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా రాయుడు సత్యనారాయణ మూర్తి, అయినవిల్లి నీటి సంఘం అధ్యక్షుడిగా కాకర శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా లింగోలు వెంకట గంగధర నెహ్రూ, శానపల్లిలంక నీటి సంఘం అధ్యక్షుడిగా గుద్దటి రామకేశవబాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కొడవీటి గోవిందరాయుడులను ఏకగ్రీవంగా డైరెక్టర్లు ఎన్నుకున్నారు. వీరిని కూటమి నాయకులు అభినందించారు. ఎన్నికలను స్థానికల తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహరా, డీటీ, ఆర్ఐ పర్యవేక్షించారు.

రాజోలులో..

రాజోలు: నీటి సంఘాలకు నిర్వహించిన ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. తాటిపాక, కడలి, పొన్నమండ, పొదలాడ, రాజోలు నీటి సంఘాలకు రాజోలు, చింతలపల్లి ఉన్నత పాఠశాలల్లో ఎన్నిక నిర్వహించారు. తాటిపాక నీటి సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కడలి కృష్ణమోహన్, చిత్రపు బాలకణ్ణన్‌కుమార్, కడలి నీటి సంఘానికి గాలిదేవర వెంకన్నబాబు, ఆకుమర్తి వెంకటేశ్వరరావు, పొన్నమండ నీటి సంఘానికి గుబ్బల శ్రీనివాస్, చేగొండి త్రిమూర్తులు, పొదలాడ నీటి సంఘానికి ఉలిశెట్టి లక్ష్మణరావు, గెద్దాడ వెంకటేశ్వరరావు, రాజోలు నీటి సంఘానికి పినిశెట్టి వెంకటస్వామి(బుజ్జి), రామేశ్వరపు వెంకట ప్రభాకరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నీటి సంఘ డైరెక్టర్లుగా ఎన్నికైన వారికి ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఎన్నికలను తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ పర్యవేక్షించారు.

మలికిపురంలో..

మలికిపురం: మలికిపురం నీటి సంఘం అధ్యక్షుడిగా తిరుమల సుబ్బారావు (బాబి), ఉపాధ్యక్షురాలిగా ఉంగరాల వర లక్ష్మి, లక్కవరం నీటి సంఘం అధ్యక్షుడిగా రాపాక మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడిగా కాపిశెట్టి కనికేశ్వరరావు, రామరాజులంక నీటి సంఘం అధ్యక్షుడిగా ముద్దల సూర్యనారాయణ ఎన్నికయ్యారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మండలంలోని మూడు సెక్షన్లలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలను తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎంపీడీఓ జి.సరోవర్‌ల పర్యవేక్షణలో శనివారం ప్రశాంతంగా జరిగాయి. కె.పెదపూడి సెక్షన్‌కు సంబంధించి పుల్లేటికుర్రులో నిర్వహించిన ఎన్నికలో చైర్మన్‌గా లక్కింశెట్టి వెంకట తిరుపతిశివ ప్రసాద్, వైస్ చైర్మన్‌గా అంబటి సత్యనారాయణలు, పసుపల్లి సెక్షన్‌కు సంబంధించి చైర్మన్‌గా నిమ్మకాయల వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా నాగులపల్లి కొండలరావు, ఇసుకపూడి సెక్షన్ పరిధిలో చైర్మన్‌గా కోలనాడ సత్యనారాయణరాజు, వైస్ చైర్మన్‌గా పప్పుల సత్యనారాయణలు ఎన్నికయ్యారు. వీరితో పాటు పాలక వర్గ సభ్యులను ఎన్నుకొన్నట్లు తహసీల్దార్, ఎంపీడీవోలు తెలిపారు.

నాలుగు సాగునీటి సంఘాలు ఏకగ్రీవం

ఆలమూరు: మండలంలోని నాలుగు సాగునీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. పెదపళ్లలో సాగునీటి సంఘానికి గారపాటి శ్రీనివాసు, చొప్పెల్లకి మెర్ల గోపాలం, మడికి సాగునీటి సంఘానికి చెల్లుబోయిన అబ్బులు, చింతలూరుకి వైట్ల గంగరాజుతో సహచర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈవోపీఆర్డీ కె.నాగేశ్వరరావు, తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీఓ ఎ.రాజు, ఇరిగేషన్ జేఈ టి.కృష్ణ త్రిమూర్తులు ఎన్నికలను పర్యవేక్షించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: కొత్తపేట నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా బండారు వీర్రాఘవులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తపేట బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలకు ఎన్నికల అధికారి మాధవరపు వెంకట రామారావు పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలలో 12 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తదనంతరం జరిగిన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో అధ్యక్షుడిగా బండారు వీరబాబు, ఉపాధ్యక్షుడిగా చోడే రామకృష్ణలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలోని మానేపల్లి, పి.గన్నవరం సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ఏకగ్రీవం అయ్యాయి. మానేపల్లి నీటి సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా మద్దాల తమ్మన్న, గిడుగు రారాజు ఎన్నిక అయ్యారని ఎన్నికల అధికారి ఎస్‌జేవీ రామ్మోహన్‌రావు తెలిపారు. పి.గన్నవరం నీటి సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా చొల్లంగి సత్యనారాయణమూర్తి, మానేపల్లి వీరాస్వామి నాయుడు ఎన్నికయ్యారు. ఎన్నికలను తహసీల్దార్ శ్రీవల్లవి పర్యవేక్షించారు.